

# ఐసోపు గురించి రెండు ముక్కలు

ఐరనీ ఆఫ్ లైఫ్ అంటే యిదేన్మో వెంకటేశం_కాకపోతే ఏవిటి చెప్పు. లాస్టియ రీ సీజన్‌లో నేనెక్కడున్నాను ....కోడంబాక్కంలోని పెలేషియల్ బిల్డింగ్‌లో, హోరున కురుస్తున్న వానచూస్తూ ఫ్రెంచి విండోపక్క నిలబడ్డ నాకో మంచి విడో పక్కనుంటే మహాకావ్యాలు రాయగల్నని పించింది. తీరా ఈరోజున రెండు వరాలూ గ్రాంటు అయ్యాయిగాని... ఏవిఁ లాభం. అన్నీవున్నాయిగాని ఐదోతనం తక్కువన్నట్లు...ఛ. అవాచ్యమ ప్రతిహతమగుగాక ... దేవుడు వరమిచ్చాడు. గాని పూజారిణి బుచ్చెమ్మ వదిన ఆమోదించటంలేదు. నాకేవిలేమధ్యన, లోకాని

క్కాసిని మహాకావ్యాలు లభించకుండా పోతాయి... కాళిదాసు పిక్చరు చూశావో లేదోగాని అదిచూస్తే ఆటగాడి కీలకం తెలిసింది. అంథా వైపు వైపు ఇన్స్పిరేషనేనమ. నేనప్పుడేఅనుకున్నా. ఎంత కాళిదాసైనా ఒంటిచేత్తో ఇంత ఘనమైన బుక్కు లెక్కడరాయగల్డులే ఆడ చ్ఛాయి జేసుకో పోతేనూ అని....

చూశావూ చూశావూ కాళిదాసు పేరెత్తగానే కవిత్వం తన్నుకొస్తోంది. మైడియర్ వెంకటేశం! ఇప్పుడు నీకీ రెయిన్, అనగా వర్షం యలా కనిపిస్తుందోయ్! భూలోకంలోని బ్యూటిఫుల్ యంగ్ విడోస్‌కోసం దేవతలు హోరున దుఃఖాశ్రువులు రాలుస్తున్నట్టు కనబట్టం లేదూ? మీ సిస్టర్ మనసులో గాఢంగాను, ఫేసులో లీలగాను గోచరించే భావాలను ప్రకృతే నటించి పెడుతుందోయ్. కాని ప్రదర్శించేందుకు భావాలుండి, ప్రదర్శించగల ప్రజ్ఞ కూడా ఉన్న మీ సిస్టరు నేటి సినిమా యాక్టర్లలా ప్రకృతినీ సెట్టింగునూ తోడుగా వాడుకోవడం శుష్కడంబుగ సుమీ.

మన సినిమా యాక్టర్లయితే బాధ, ఆవేదనవంటి మనస్థితులను గాఢంగా ప్రదర్శించవలసివస్తే ఎన్నో హంగులు చేసుకుంటారు. కామెరా టిల్ట్ చేయిస్తారు, గిర్రున తిప్పుతారు. సూపరింపోజులో రైళ్ళు పరుగెత్తినట్లు చూపిస్తారు. మొహంమీద గిర్రున తిరుగుతున్న పంకా నీడలు చూపిస్తారు. ఇవన్నీ చాలక అరవై వయొలిన్‌లు, ఇరవై క్లారినెట్లు నేపథ్యపాటలతో గొడవచేయిస్తారు. ఇన్ని

చేసినా భలానాపాత్ర చాలా బాధపడుతోంది గావున దేవుడా మనవున్నా దుఃఖించాలి గాబోలు అన్న జ్ఞానం ప్రేక్షకులకు కలగటంలేదట. మరి అంచేతను గావును ఇటుపై సినిమాల్లో ఏడుపుసీనులు గట్రా నడుస్తున్న సమయంలో అది చూస్తున్న ప్రేక్షకుల్ని కుట్టేందికి నల్లుల్నీ గిల్లి రక్కా బాధపెట్టేందికి కిరాయి జవానుల్నీ పెడతారట.

అప్పటికీకూడా తెరమీద నటులబాధ చూసి జాలి పడలేని మొండిఘటాలుంటే, వాళ్ళకి అయినవాళ్లో కాని వాళ్లో హరీమన్నారని వాళ్ళచెవుల్లో వూది భోరున ఓసారి ఏడిపించి కళ్ళు తుడుస్తారట. ఇదికూడా డైరెక్షను యాక్టింగు కళలో భాగవేఁ. కానీ గిరీశంలాంటి డైరెక్టరాక్టరూ బుచ్చెమ్మలాటి బ్రహ్మాండమైన నటీ వడి కడితే ఇవన్నీ శుష్కదండుగే. అసలప్పుడు మేంచూపించడానికి లోకంలో ఉన్న బాధంతా చాలదు; లోకంలోఉన్న ఆనందం అంతా పోగేసినా మాకు ఒక ఎక్స్‌ప్రెషన్‌కి చాలదు. ఏవిటనుకున్నావోమరి ...

యేవిటోయ్ వెంకటేశం. నేను ఎప్పుడూ మూడ్ లోకిరాను. రాక రాక వచ్చి వుంజుకొని అక్షరలక్షలయిన ఉపన్యాసాలిస్తూవుంటే మీ సిస్టరలా వెళ్ళిపోతుందీ! విన్నది కాస్తకాస్త హరాయించుకొన్నాక మరికాస్త విందామనా! ....

యవరూ ఫాదరిన్లాగారా! అంటే పూజనీయులని లెండి. దయచెయ్యండి. హరాయించుకోవడం__అనగా డైజేషన్‌గురించి మీవాడికి లెక్చరిస్తున్నాను. ఇది సైన్సు

లెండి. అబ్బో దొరల కఖ్కర్లేని విషయంలేదు... అదే అదే. ఇలా మసాబుగా ఉన్న రోజున శాస్త్ర తిండి చిరు తిండీ తగ్గించుకోవాలనిన్నీ లేకపోతే అరగదనిన్నీ చెబుతున్నాను.... తిండే చిరుతిండి సయిజుకి తగ్గాలి. మరి చిరు తిండి కూడనే కూడదన్నారు ఎల్ఫిన్‌స్టన్ దొరవారు.

చిత్తం. మీరన్నది విలువైనముక్కే కానీండి ఈ కాలప్పిల్లలలా హరాయించుకోలేరు. వీళ్ళంతా కుర్రసజ్జు. వఠి అర్భకులు...

....ఎవడండీ అంత మాటంటూ. తమవంటి వారింట ఆశ్రయం పొందుతూ వెధవ సెంటు సినిమా మానేజర్ని చేబదులడగడం నాకేం ఖర్మవండీ. ఏదో పొరబాటై యుండాలి. ఆఁ. ఏంకాదూ నిన్నగామోసు అలాషికారు కెళ్తే వాడు గనబడి బలవంతాన టీ గట్రా పట్టించి ఈ గవర్నమెంటు యక్సయిజున్నూ, దానివల్ల హాలువాళ్ళకి పడే సుంకం గురించిన్నీ అడిగాడు,ఆవేడిలో సర్కారువాడికి చెమ్డా లెక్కదీసి మరీ నాలుగూ అనేశాను. ఎదట లేకపోయాడుగాని ఉంటే డంగైపోయేవాడు. ఆపైన పన్నులు ఒన్నులూ పడితే నీకేమయ్యా మహారాజాలాం జనం నెత్తికి తోసెయ్ టిక్కెట్లు పెంచిపారేయ్. అటు సర్కారువాడిముందు నీ ఆబోరు దక్కుతుంది. ఇటు అడ్డమైన చెత్తసినిమాలనీ చూసి మన ఇండస్ట్రీని చెడుదారిలో నడుపుతున్న ప్రేక్షకులికి జుల్మానా వేసినట్టున్నూ ఉంటుంది అన్నాను.

అంతే వాడానందం పట్టలేక ఉక్కిరిబిక్కిరైపోయి

కాళ్ళమీద పడ్డంతపని చేశాడు. నా ఋణం తీర్చుకోలేన్నాడు. ఆనక అయిదూ పదీ కావలిస్తే ఋణం పట్టికెళ్ళమన్నాడు, ఒద్దు మొర్రో అగ్నిహోత్రావధాన్లుగారు నీ డొక్క వాలికల్జేయించేస్తారని నేను. కాదు మొర్రో అని వాడూ. చివరికి నాకు తెలీకుండా నా కమీజు కేవన్నా అంటించేశాడుగావును. ఆనోటలాగే నాతోబాటు వచ్చి ఉండాలి. ఇచ్చేద్దాంలెండి. మీ రిమ్మన్నారని పిన్నిగారి నడిగుచ్చుకుని వాడి యదాన కొడతా నదెంతసేపు.

* * *

తరవాత మరొక్క విషయవండి. నిన్ననే మనవి చేదామనుకున్నాను. సర్కారువాళ్ళు, నావంటి జీనియస్‌లు మంచి ఫిలిములు తియ్యడంకోసవఁని బాంకిలో ఇరవై లక్షల్జాగర్జేశారట. వచ్చి కావలిసింది తీసుకుని అఖండవైన కళాఖండవొఁటి తీసుకోవలసిందని ఉత్తర్వైంది పైనించి. అంచేత బహుశా నేను రెండ్రోల్లో బయల్దేరాల్సుంటుంది. సర్కార్నించి మణీయార్డ్రు రాగానే—మనియార్డరేవస్తుందో మనిషే రొఖ్ఖం పట్టించుకొస్తాడో చెప్పలేననుకోండి.

ఏవన్నారూ అందరికీ ఇస్తాగా అనా, ఆహాఁ. వారనడం అలాగే అంటున్నారు. అయితే ముందస్తుగా తలాతోకావున్న ఓ కథా, దాని కమామీషూ కాగితమ్మీద పెట్టి చూపించినమీదటనే డబ్బు చేతిలో పడుతుందని షరతు. నావంటి పెద్దవాళ్ళక్కాదనుకోండి.... ఏం అంచేత డబ్బాశవున్న ఏ ప్రొడ్యూసరు ఆపని చేయగల్డు. అసలు కథలకే దిక్కులేదు. పైపెచ్చు తలాతోకావున్న కథ

తెమ్మంటే ఎలా తెస్తాం. నిజానికి నవ్వుకుంటున్నారు ఇండస్ట్రీలో అంతా. ఇదెన్నడేనా కన్నావా విన్నావాఁ విడ్డూరంగాపోతే. సినిమా తియ్యకుండా కథేమిటంటే ఎలా చెప్పగలం. ఆవటాని.

అంచేత చెప్పొచ్చిందేవిటంటే, నాకా మణీయార్డరొచ్చేలోగా తవరో హస్తం...

చిత్తం చిత్తం. దానికేం అలాగే తరవాత మాట్లాడదాం....

